సాక్షి నిజామాబాద్

శనివారం, 2, మార్చి, 2024



బైపాస్ రోడ్ల నిర్మాణానికే..

63వ నంబర్ జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్ల నిర్మాణానికి భూసేకరణ కోసం అధికారులు చర్యలు చేపట్టారు.

- 8లో ▸



వర్సిటీల పాత్ర కీలకం

దేశాభివృద్ధిలో వర్సిటీలు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఏబీఆర్ఎస్ఎం జాతీయ ఉపాధ్యక్షురాలు పేర్కొన్నారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
35.6 /17.5

ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా తాహెర్



ఖలీల్‌వాడి: రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా కాంగ్రెస్ నేత తాహెర్ బిన్ హందాన్ నియమితులయ్యారు. మైనారిటీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ సయ్యద్ ఉమర్ జలీల్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిరికొండ మండల కేంద్రానికి చెందిన తాహెర్ జిల్లాలో అత్యంత సీనియర్ నేత. ఆయన 1985, 2018లో నిజామాబాద్ అర్బన్, 1994లో బోధన్ నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేశారు. 2006లో సిరికొండ జెడ్పీటీసీగా గెలుపొంది జెడ్పీ వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ప్రస్తుతం ఆయన పీసీసీ ఉపాధ్యక్షుడిగా పనిచేస్తున్నారు.

మోపాల్ సొసైటీ చైర్మన్ ఉమాపతిరావు రాజీనామా



మోపాల్(నిజామాబాద్‌రూరల్): మోపాల్ సహకార సంఘం(సొసైటీ) చైర్మన్ బల్గూరి ఉమాపతిరావు వ్యక్తిగత కారణాలతో శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా పత్రాన్ని డీసీవో శ్రీనివాస్‌కు అందజేశారు. ఉమాపతి రావు రెండేళ్ల క్రితం చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఆయ న రాజీనామాతో తదుపరి చైర్మన్ ఎన్ని కయ్యే వరకూ వైస్ చైర్మన్ ఇన్‌చార్జిగా కొనసాగనున్నారు. త్వరలోనే చైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: జిల్లా వైద్యారోగ్యశాఖ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ సుదర్శనం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వీటిని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులను ఈ నెల 2 నుంచి 7 వరకు కలెక్టరేట్‌లోని 201వ గదిలో అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో అప్లై చేయాలనుకునే వారు nizamabad.telangana.gov.in ద్వారా చేసుకోవాలన్నారు.

పోస్టు	ఖాళీలు
స్టాఫ్‌నర్సులు	30
డీఈవో	01
ఏఎన్ఎం	03
డీఈవో కమ్ అకౌంటెంట్	03
ఫార్మాసిస్టు	06

నెగ్గిన అవిశ్వాసం



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వైస్‌చైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస పరీక్ష నెగ్గింది. శుక్రవారం జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలకవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వైస్ చైర్మన్ రాజారెడ్డి హాజరుకాలేదు. అయితే అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చైర్మన్ భరత్‌రెడ్డితో సహా మొత్తం తొమ్మిది మంది డైరెక్టర్లు చేతులు పైకెత్తారు. దీంతో సొసైటీ వైస్ చైర్మన్‌గా రాజారెడ్డి తన పదవిని కోల్పోయినట్లు డీసీవో ప్రకటించారు. ఖాళీ అయిన వైస్ చైర్మన్ పదవి భర్తీకి శనివారం పాలకవర్గంతో సమావేశం ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

కొనసాగుతున్న ఎస్సారెస్పీ నీటి విడుదల

బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి కాల్వల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 7వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 800 క్యూసెక్కులు, లక్ష్మి కాలువ నుంచి 250 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ నుంచి 472 క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నాయి. ముంపు గ్రామాల లిఫ్ట్ ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరిరూపంలో 426 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీరుపోతుంది. పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 1070.20 అడుగుల(29.26టీఎంసీలు) నీరు నిల్వ ఉందని అధికారులు పేర్కొన్నారు.



నిజామాబాద్ మార్కెట్‌లో పసుపు కుప్పలు

పసుపు ధర పైపైకి..

- నిజామాబాద్ మార్కెట్‌లో తాజాగా క్వింటాలుకు రూ. 15,182 పలికిన రేటు
- యార్డుకు నెలరోజుల్లో లక్షన్నర క్వింటాళ్లు రాక

సుభాష్‌నగర్/మోర్తాడ్: పసుపు రైతులకు మంచి రోజులు వచ్చాయి. దిగుబడితో పాటు మార్కెట్‌లో ధర వస్తుండడంతో రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా శుక్రవారం నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో క్వింటాలు ధర రూ. 15,182 పలికింది. బాల్కొండ మండలం వన్నెల్(బి)కి చెందిన పాలెపు పురుషోత్తం 10 క్వింటాళ్ల పసుపునకు ఈ ధర దక్కింది. ఈ సీజన్‌లో ఇదే అత్యధిక రేటు. మరో 206 క్వింటాళ్లకు రూ. 14వేలకు పైగా, 1500 క్వింటాళ్లకు రూ. 13 వేలకు పైగా, 2వేల క్వింటాళ్లకు రూ. 12వేలకు పైగా ధర వచ్చింది. కాగా 2011లో క్వింటాలుకు రూ. 16,166 ధర పలికి మార్కెట్ చరిత్రలో రికార్డు సృష్టించింది. కానీ ఈ సీజన్‌లో అంతకుమించి ధర పలికే అవకాశముందని మార్కెట్, వ్యాపార వర్గాలు భావిస్తున్నాయి.

సాంగ్లీ మార్కెట్‌లో ధర ఎక్కువే..

పసుపునకు జాతీయ మార్కెట్‌గా పేరొందిన సాంగ్లీలో ఈసారి క్వింటాలుకు రూ. 16,500ల ధర దాటడం లేదు. నిజామాబాద్ మార్కెట్‌తో పోల్చితే అక్కడ ధర కనీసం రూ. 2వేలు ఎక్కువ లభిస్తుంది. సాంగ్లీ మార్కెట్ కంటే నిజామాబాద్ మార్కెట్‌వైపు వ్యాపారులు దృష్టి సారించడంతో ఇక్కడ ధర పెరగడం, మహారాష్ట్రకు తరలించినా రవాణా ఖర్చులు కూడా కలిసి రావనే ఉద్దేశంతో రైతులు సాంగ్లీకి తరలించడానికి ఆసక్తిని చూపడం లేదు. పసుపు విక్రయాలకు సంబంధించి ఈనామ్ విధానం అమలైతే సాంగ్లీలో లభించే ధరనే నిజామాబాద్ మార్కెట్‌లో దక్కేదని రైతులు చెబుతున్నారు.

తగ్గుతున్న సాగు విస్తీర్ణం

పసుపు పంటకు గత కొన్నేళ్ల నుంచి ఆశించిన ధర లభించకపోవడం, సాగుకు పెట్టుబడులు అధికం కావడంతో రైతులు సాగు విస్తీర్ణా న్ని గణనీయంగా తగ్గించారు. సాగు విస్తీర్ణం 40శాతం తగ్గిపోవడం, అధిక వర్షపాతం వల్ల పంట దిగుబడిపై ప్రతికూల ప్రభావం చూపింది. దీనికి తోడు ఎగుమతులకు ఊతం ఇవ్వడంతో రాష్ట్ర, జాతీయస్థాయి మార్కెట్లలో పసుపు పంటకు కొరత ఏర్పడింది. ఈ కారణంగా పసుపు ధర పెరగడం జరిగిందని రైతులు చెబుతున్నారు.

సంవత్సరం	పంట సాగు విస్తీర్ణం	మార్కెట్‌కు వచ్చిన పసుపు(క్వింటాళ్లు)
2021-22	31,413	8.15 లక్షలు
2022-23	21,913	5.75 లక్షలు
2023-24	20,650	1.50లక్షలు (ఇప్పటివరకు)

క్రమక్రమంగా తగ్గుతూ..

నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మూడేళ్లుగా పసుపు క్రయ విక్రయాలు క్రమంగా తగ్గుతున్నాయి. ఈఏడాది 5లక్షల క్వింటాళ్ల వరకే పసుపు వస్తుందని మార్కెట్ కమిటీ అధికారులు భావిస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో యార్డుకు లక్షన్నర క్వింటాళ్ల పసుపు వచ్చినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌కు గతంలో ఒక్కో రోజు 50వేల నుంచి 60వేల వరకు సంచుల పసుపు వచ్చేది. కానీ ఈ సీజనులో 20వేల నుంచి 30వేల సంచులు మాత్రమే వస్తోంది. నిజామాబాద్ మార్కెట్‌కు ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా, ఏపీలోని నంద్యాల, దుగ్గిరాల నుంచి రైతులు పసుపును తీసుకొస్తారు.

పంటను తొందరపడి అమ్ముకోవద్దు



పసుపు పంటకు డిమాండ్ ఉన్న నేపథ్యంలో భవిష్యత్‌లో ధర మరింత పెరిగే అవకాశముంది. కావున రైతులు తొందరపడి అమ్ముకోవద్దు. తాజాగా పలికిన ధర కంటే రూ. 2వేల వరకు పెరగొచ్చు. అధిక కర్క్యూమిన్ కలిగిన వంగడాలను సాగుచేయడంతో పాటు సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తే అంతర్జాతీయంగా మరింత డిమాండ్ వస్తుంది. పసుపునకు మంచి ధర పలకడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. -వెంకటేశం, సెలక్షన్ గ్రేడ్ సెక్రెటరీ, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్

ఇదే ధర కొనసాగాలి



పసుపు పంటకు ప్రస్తుతం మంచి ధర వస్తోంది. ఇప్పుడు ధర ఇలా కొనసాగితేనే వచ్చే సీజన్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది. లేదంటే సాగు విస్తీర్ణం మరింత తగ్గుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పసుపు సాగుకు ప్రోత్సాహం అందిస్తే బాగుంటుంది. అలాగే ధర నిలకడగా ఉండాలంటే.. కనీస మద్దతు ధర ప్రకటించి అమలు చేయాల్సిన అవసరం ఉంది. - గడ్డం లింగారెడ్డి, రైతు, గుమ్మిర్యాల్

ప్రజాపాలన సేవాకేంద్రాలను నెలకొల్పాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి
- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశం

సుభాష్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా కృషి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లకు సూచించారు. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాల ద్వారా అర్హత కలిగిన వారందరూ ప్రయోజనం పొందేలా అన్ని ఎంపీడీవో కార్యాలయాలు, మున్సిపల్ వార్డు ఆఫీసుల్లో సత్వరమే ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. రాష్ట్ర డీజీపీ రవిగుప్తాతో కలిసి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లు, సీపీలు, ఎస్పీలతో సీఎస్ సమీక్ష నిర్వహించారు. ప్రజాపాలన కార్యక్రమం సందర్భంగా దరఖాస్తు చేసుకోలేకపోయిన అర్హులైన వారితో పాటు, దరఖాస్తుల్లో సరైన వివరాలు నమోదు చేయని వారికోసం ప్రజాపాలన సేవా కేంద్రాలను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయాలని సూచించారు. కొత్తగా ఏర్పాటైన పలు మండలాల్లో ఎంపీడీవో కార్యాలయాలు లేనందున, అలాంటి చోట తహశీల్ ఆఫీసుల్లో సేవా కేంద్రాలను అందుబాటులోకి తేవాలన్నారు. సోమవారం వరకు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చి పని తీరు ప్రారంభం కావాలని గడువు విధించారు. పని దినాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సేవా కేంద్రాలు తెరిచి ఉంచాలన్నారు.

తప్పిదాలకు తావివ్వొద్దు

ప్రస్తుతం కొనసాగుతున్న ఇంటర్మీడియట్‌తో పాటు త్వరలో ప్రారంభం కానున్న పదోతరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచించారు. తప్పిదాలు తావులేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలన్నారు. కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ట్రెయినీ ఐపీఎస్ చైతన్య, డీఐఈవో రఘురాజ్, డీఈవో దుర్గాప్రసాద్, ఆర్టీసీ ఆర్ఎం జాన్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, డీఎస్‌వో చంద్రప్రకాశ్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్, అధికారులు

మహిళల ఆత్మరక్షణ కోసం శిక్షణ

- రేపు జీజీ కాలేజీ మైదానంలో 11వేల మందితో ప్రదర్శన
- ఇండియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్ కోసం శిక్షణ కార్యక్రమం
- డీఎల్ఎస్ఏ అధ్యక్షురాలు, జిల్లా జడ్జి సునీత కుంచాల



మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: మహిళలు, విద్యార్థులకు ఆత్మరక్షణ కోసమే శిక్షణ నిర్వహిస్తున్నట్లు డీఎస్ఎస్ఏ అధ్యక్షురాలు, జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శుక్రవారం జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి సమాజంలో మహిళలు, ఆడపిల్లలకు ఆత్మరక్షణ శిక్షణ ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు, వర్కింగ్ ఉమెన్స్ ఆత్మరక్షణ(సెల్ఫ్ డిఫెన్స్) ప్రదర్శన కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిక్షణ విద్యార్థులు, మహిళలకు ఆత్మస్థైర్యం పెంపొందించడానికి తోడ్పడుతుందన్నారు. ఇండియా బుక్ రికార్డులో ఈ శిక్షణ చేరుతుందన్నారు. శిక్షణ కార్యక్రమానికి సహకరించిన తైక్వాండో శిక్షకుడు మనోజ్ మాస్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పద్మావతి, బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు ఆశ నారాయణ పాల్గొన్నారు.

పసుపు ధరపై బాండ్ పేరిట ఎంపీ మరో నాటకం



మాట్లాడుతున్న పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్, పక్కన కేశ వేణు, గడుగు గంగాధర్

- వైఎస్ హయాంలోనే పసుపు ధర రూ. 17వేలు
- పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్

ఖలీల్‌వాడి: ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపు ధర్‌పై బాండ్ పేరిట మరో నాటకానికి తెరలేపారని పీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ విమర్శించారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ భవన్‌లో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ దేశ సంపదను నిర్వీర్యం చేసిందని ఆరోపించారు. 2018లో ఎంపీ ఎన్నికలకు ముందు ముత్యంపేట్ నుంచి బోధన్ వరకు ఎన్డీఎస్ఎల్‌ను తెరిపిస్తానని పాదయాత్ర చేసిన సంగతి ఎంపీ అర్వింద్ మరిచిపోయినట్లు మట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీ హయాంలో 30 ఫ్యాక్టరీలను తెరిపించినట్లు చెప్పిన ఎంపీ అర్వింద్ బోధన్ షుగర్ ఫ్యాక్టరీని ఎందుకు తెరిపించలేదని ప్రశ్నించారు. పసుపు ధర రూ. 14వేలు పలుకుందని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడే రూ. 17వేల ధర పలికిందని గుర్తు చేశారు. జిల్లాలో 60వేల ఎకరాల పసుపు సాగు భూమి ఉంటే ప్రస్తుతం 22 వేల పసుపు సాగవుతుందని.. దీనిని నిర్లక్ష్యం చేసింది ఎవరో చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే ఎన్నికలకు ముందు ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి రాజకీయాలకు వచ్చారని, జిల్లాపై అవగాహన లేకుండా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విమర్శలు చేయడం సరైందికాదన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, కాంగ్రెస్ నేతలు కేశవేణు, రత్నాకర్, భక్తవత్సలం, సయ్యద్‌ఖైసర్, జావేద్ అక్రమ్, రాంభూపాల్, సుధాకర్ రావు, మహేశ్, ఎన్ఎస్‌యూఐ నేతలు వేణురాజ్, విపుల్ గౌడ్ పాల్గొన్నారు.

పదేళ్లుగా పాతుకుపోయారు!

- ఐకేపీలో జరగని ఉద్యోగ బదిలీలు
- ఒకేచోట పనిచేస్తున్న డీపీఎంలు, ఏపీఎంలు, సీసీలు
- స్థానచలనం కోసం ఎదురుచూస్తున్న చాలామంది ఉద్యోగులు
- గతంలోనే సెర్ప్‌కు చేరిన సీనియారిటీ జాబితా



డొంకేశ్వర్(ఆర్మూర్): గ్రామీణాభివృద్ధి శాఖలో బదిలీలు లేక ఐకేపీ ఉద్యోగులు పాతుకుపోయారు. ఒకేచోట ఎక్కువకాలం పనిచేస్తూ కుర్చీలను వదలడం లేదు. దాదాపు పదేళ్లకు పైగా జిల్లా, మండల కార్యాలయాల్లోనే తిష్టవేసుకుని కూర్చుకున్నారు. ఇది నిబంధనలకు వ్యతిరేకమని తెలిసినా గత ప్రభుత్వం బదిలీలు చేపట్టలేదు. ఇది కొంతమందికి కలిసి రాగా, మరికొందరికి ఇబ్బందికరంగా మారింది. అయితే మెజార్టీ ఉద్యోగులు తమకు బదిలీలు చేయాలని గత ప్రభుత్వానికి విన్నవించినా కూడా వారికి స్థానచలనం కలిగించకపోవడం విడ్డూరమనే చెప్పాలి. బదిలీల కోసం జిల్లా నుంచి ఉద్యోగుల సినియారిటీ జాబితాను రాష్ట్ర సెర్ప్ శాఖకు పంపినా అవి బుట్టదాఖలయ్యాయి. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఐకేపీలో మళ్లీ బదిలీల అంశం తెరపైకి వచ్చింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో డీఆర్‌డీవోలు, ఏపీడీలకు ఇటీవల బదిలీలు అయ్యాయి. ఈ నేపథ్యంలో డీపీఎం, ఏపీఎం, సీసీలను కూడా కదిపితే బాగుంటుందనే కొంత మంది ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. బదిలీలు జరగకపోతే బాగుంటుందని మరి కొంత మంది భావిస్తున్నారు. ప్రస్తుతం ఐకేపీలో అన్ని కేడర్ల ఉద్యోగులు కలిపి 216 మంది పనిచేస్తున్నారు. ఇందులో జిల్లా ప్రాజెక్టు మేనేజర్లతో పాటు అదనపు ప్రాజెక్టు మేనేజర్లు, కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, మినిస్టీరియల్ స్టాఫ్, ఇతర ఇబ్బంది ఉన్నారు. ప్రభుత్వం స్పందించి బదిలీలు చేపడితే జిల్లాలో 90 శాతం మందికి స్థానచలనం కలుగనుంది. శాఖను కూడా ప్రక్షాళన చేసినట్లు కూడా ఉంటుంది.

ఐకేపీలో కేడర్ల వారీగా ఉద్యోగులు

అదనపు పీడీ	01	సీసీలు (ఎల్-1)	18
డీపీఎంలు	06	ఎంఎస్ సీసీలు	54
ఏపీఎంలు	30	ఇతర సిబ్బంది	10
సీసీలు (ఎల్-2)	97	మొత్తం	216

తిష్టవేయడంతోనే అక్రమాలు

ఎక్కువ కాలం ఒకే ప్రాంతంలో కొనసాగడంతో ఐకేపీ శాఖలో అక్రమాలు జరుగుతున్నాయి. జిల్లా, మండల కార్యాలయాల్లో ఉద్యోగులు అవినీతికి పాల్పడుతున్నారు. మహిళా సంఘాలకు సంబంధించిన డబ్బులు పక్కదారి పట్టించిన ఘటనలు జిల్లాలో చాలానే ఉన్నాయి. ఎస్‌హెచ్‌జీలకు సంబంధించిన పొదుపు, రుణాలను ఉద్యోగులు తమ సొంతానికి వాడుకున్న వారిపై చర్యలు తీసుకుని డబ్బులు కూడా రికవరీ చేయించారు. అడ్డదారులు తొక్కిన ఏపీఎంలు, సీసీలు సస్పెండ్ సైతం అయ్యారు. ఏళ్ల తరబడి కుర్చీలకు పాతుకుపోవడంతో వారికి ఆ ప్రాంతంపై, సబ్జెక్టుపై పూర్తిగా అవగాహన ఏర్పడుతోంది. దీంతో అవినీతికి పాల్పడుతున్నారు. ఇలాంటి వారిని కదిలిస్తే తప్ప అక్రమాలకు అడ్డుకట్ట పడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బదిలీలు చేపడితే దూర ప్రాంతాల్లో ఉన్న వారికి సైతం కొంత మేలు జరుగుతుంది.

గోదావరికి జలకళ



త్రివేణి సంగమం వద్ద పరవళ్లు తొక్కుతున్న గోదావరి



నదిలో తెప్పలు వదులుతున్న భక్తులు

నిన్నటి వరకు బోసిపోయిన గోదావరి నది శుక్రవారం జలకళను సంతరించుకుంది. ఎగువన మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదలడంతో కందకుర్తి త్రివేణి సంగమం వద్ద వరద నీరు పరవళ్లు తొక్కుతు ప్రవహిస్తోంది. పుష్కరక్షేత్రం వద్ద నదిలోని పురాతణ శివాలయం వరకు నీరు వచ్చి చేరింది. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి.. తెప్పలు వదిలి గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. నదిలోని పురాతన శివాలయంతో పాటు ఒడ్డున గల పుష్కరరాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. –రెంజల్(బోధన్)

రేపు పల్స్‌పోలియో

- నేడు అవగాహన ర్యాలీ
- జిల్లాలో 1,91,081 పిల్లలు
- అందుబాటులో 2.47 లక్షల వ్యాక్సిన్లు



నిజామాబాద్‌నాగారం: జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. 5 ఐదేళ్లలోపు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు వేయనున్నారు. జిల్లాలకు అవసరమైన 2.47 లక్షల పోలియో వ్యాక్సిన్లు తెప్పించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులు, పాఠశాలలు, గ్రామ పంచాయతీలు, బస్టాండ్, రైల్వేస్టేషన్, రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలు, తదితర ప్రాంతాల్లో పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లాలోని ప్రజలందరికీ పల్స్ పోలియోపై అవగాహన కల్పించడానికి శనివారం నగరంలో పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో సుదర్శనం తెలిపారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి నగరంతో పాటు, జిల్లాలో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు.

1007 బూత్‌ల ఏర్పాటు

జిల్లాలోని బోధన్, ఆర్మూర్, నిజామాబాద్ డివిజన్ల పరిధిలో 1,91,081 లక్షల మంది బాలబాలికలున్నారు. వీరందరికి ఆదివారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేయనున్నారు. ఇప్పటికే జిల్లాలో 1007 బూత్‌లు ఏర్పాటు చేశారు. అలాగే బస్టాండ్, రైల్వేస్టేషన్లలో 37, మొబైల్‌టీంలు 36 అందుబాటులో ఉంటాయి. జిల్లా అంతటా ఆదివారం పోలియో చుక్కలు వేయనున్నారు. అయితే ఎవరైనా పిల్లలకు చుక్కలు వేయించకపోతే సోమ, మంగళవారాల్లో సిబ్బంది ఇంటింటికి తిరిగి పోలియో చుక్కలు వేస్తారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న ఎంఈడీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న ఎంఈడీ మూడవ సెమిస్టర్‌ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగినట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 36 మందికి 35 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

పీజీ సెమిస్టర్‌ పరీక్షలకు 78 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో కొనసాగుతున్న పీజీ మొదటి సెమిస్టర్‌, ఇంటిగ్రేటెడ్‌ పీజీ 7వ సెమిస్టర్‌ రెగ్యులర్‌ పరీక్షల్లో శుక్రవారం 78 మంది గైర్హాజరైనట్లు ఆడిట్‌ సెల్‌ డైరెక్టర్‌ ఘంటా చంద్రశేఖర్‌ తెలిపారు. తెయూ పరిధిలోని వర్సిటీ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌, భిక్కనూర్‌ సౌత్‌క్యాంపస్‌, గిరిరాజ్‌ ప్రభుత్వ డిగ్రీ/పీజీ కాలేజ్‌, నిజామాబాద్‌, కామారెడ్డి, బాన్సువాడ, ఆర్మూర్‌, బోధన్‌ డిగ్రీ కళాశాలల్లో పీజీ సెమిస్టర్‌ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ పరీక్షలకు 1,283 మందికి 1,205 మంది హాజరు కాగా 78 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

హోరాహోరీగా పోటీలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ మెయిన్‌ క్యాంపస్‌ మైదానంలో నిర్వహిస్తున్న ఇంటర్‌ కాలేజ్‌ క్రికెట్‌ మెన్‌ టోర్నమెంట్‌ పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం రెండవ సెమిఫైనల్స్‌ మ్యాచ్‌లో తెయూ పీజీ జట్టు, కామారెడ్డి ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ జట్లు తలపడ్డాయి. హోరాహోరిగా సాగిన ఈ పోరులో ముందుగా టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ చేసిన వర్సిటీ పీజీ జట్టు 15 ఓవర్లలో 141 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్‌ చేసిన ప్రభుత్వ ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కాలేజ్‌ జట్టు 89 పరుగులకు ఆలౌట్‌ కావడంతో వర్సిటీ పీజీ జట్టు ఫైనల్‌కు చేరిందని తెయూ స్పోర్ట్స్‌ అండ్‌ గేమ్స్‌ డైరెక్టర్‌ బాలకిషన్‌, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ బీఆర్‌నేత తెలిపారు.

రేపు జిల్లాస్థాయి ఎంపికలు

నిజామాబాద్‌నాగారం: జిల్లా సైక్లింగ్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఈనెల 3న అండర్‌–14, 16, 18, బాలబాలికలతో పాటు, పురుషులు, మహిళల విభాగంలో ఎంపికలు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి విజయకాంత్‌రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలు ఆదివారం ఉదయం 7గంటలకు కంఠేశ్వర్‌బైపాస్‌రోడ్డులో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తమ సొంత సైకిళ్లతో పాటు ఆధార్‌ కార్డు, జనన ధ్రువీకరణపత్రం, బోనాఫైడ్‌తో హాజరుకావాలన్నారు. ఇందులో ఎంపికైన వారిని ఈ నెల 9, 10తేదీల్లో మెదక్‌ జిల్లా రామాయంపేట్‌ నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు పంపుతామన్నారు. మరిన్ని వివరాలకు 99128 83331 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బైపాస్‌ రోడ్ల నిర్మాణానికే మొగ్గు

- ఐదు రెవెన్యూ గ్రామాల్లో భూ సేకరణకు చర్యలు
- జిల్లాలోని 83.895 హెక్టార్లలో భూసేకరణకు త్వరలో నోటిఫికేషన్‌



బైపాస్‌ కోసం సర్వే నిర్వహిస్తున్న ఉద్యోగి



నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించనున్న 63వ నంబర్‌ జాతీయ రహదారి

మోర్తాడ్‌: జాతీయ రహదారి–63 విస్తరణలో భాగంగా జిల్లాలోని ఐదు రెవెన్యూ గ్రామాల్లో బైపాస్‌ రోడ్ల నిర్మాణానికి భూసేకరణ కోసం రెవెన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టింది. జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూ సేకరణకు డిప్యూటీ కలెక్టర్‌గా కోరుట్ల ఆర్డీవో సోమ రాజేశ్వర్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. మన జిల్లాలోని పెర్కిట్‌ నుంచి మంచిర్యాల్‌ జిల్లా సరిహద్దు వరకు 131.8 కిలోమీటర్ల పొడవునా సాగనున్న రోడ్డు విస్తరణకు భూమిని సేకరించే అధికారాన్ని సదరు అధికారికి అప్పగించారు. జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా జాతీయ రహదారి 63ను నాలుగు లేన్ల రోడ్డుగా విస్తరించడానికి నేషనల్‌ హైవే అథారిటీ ఆఫ్‌ ఇండియా(ఎన్‌హెచ్‌ఏఐ) నిర్ధారించింది. ఇందుకోసం రూ.3,850 కోట్ల నిధులను కేటాయించింది. దీంతో అనేక చోట్ల ఇళ్లు, పెద్ద పెద్ద భవనాలు, వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. జిల్లాకు సంబంధించి 26 కిలోమీటర్ల పొడవునా రోడ్డు పనులు చేపట్టనున్నారు. ఇందులో ఐదు చోట్ల బైపాస్‌ రోడ్లను నిర్మించనున్నారు. దీనికోసం 83.895 హెక్టార్లలో భూమిని సేకరించడానికి ఈ వారంలో నోటిఫికేషన్‌ జారీ చేసేందుకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. జాతీయ రహదారి విస్తరణ, బైపాస్‌ రోడ్ల నిర్మాణాల కోసం ఇప్పటికే ఎన్‌హెచ్‌ఏఐ నియమించిన ప్రైవేటు ఏజెన్సీలు మూడు రకాల సర్వేలను నిర్వహించారు. ఖర్చు తగ్గింపు, వ్యవసాయ భూములకు, భవనాలకు తక్కువ నష్టం జరిగేలా ఒక ప్రతిపాదనను ఎన్‌హెచ్‌ఏఐ ముందుకు తీసుకొచ్చింది. ఎన్‌హెచ్‌ఏఐ ఇచ్చిన ప్రతిపాదన ఆధారంగా రాష్ట్ర రెవెన్యూ విభాగం భూసేకరణకు చర్యలు తీసుకుంటోంది.

ఈ గ్రామాలలోనే ఎక్కువ భూమి..

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా పడకల్‌లో 8.261 హెక్టార్లు, అంక్సాపూర్‌లో 10.954, కుకునూర్‌లో 4.423, మోర్తాడ్‌లో 30.154, కమ్మర్‌పల్లిలో హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. బైపాస్‌ రోడ్ల నిర్మాణానికి భారీగా వ్యవసాయ భూములను నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే రైల్వే, వరద కాలువల కోసం తమ విలువైన భూములు కోల్పోయామని, ఇప్పుడు మళ్లీ జాతీయ రహదారి కోసం మరింత భూములను కోల్పోవడం వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే అనేక చోట్ల భూ సేకరణ కోసం నిర్వహిస్తున్న సర్వేలను రైతులు అడ్డుకున్నారు. చివరకు పోలీసుల బందోబస్తుతో సర్వేను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఏది ఏమైనా జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్‌ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం మొగ్గుచూపిందని చెప్పవచ్చు.

నోటిఫికేషన్‌ జారీ చేస్తాం

జాతీయ రహదారి విస్తరణకు అవసరమైన భూమిని సేకరించడానికి నోటిఫికేషన్‌ను జారీ చేస్తాం. బైపాస్‌ రోడ్లు నిర్మించడానికి ఎక్కువ అవకాశం ఉంది. భూ సేకరణ చట్టం ప్రకారం భూ సేకరణ నిర్వహిస్తాం. రైతులు సహకరిస్తే ఎలాంటి సమస్య ఉండదు.

– సోమ రాజేశ్వర్‌, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు



అవగాహన కల్పిస్తున్న అధికారి శేషు

రెంజల్‌: చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఒడిశాలోని భువనేశ్వర్‌ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్‌ ఇల్తెపు శేషు అన్నారు. మండలంలోని నీలా హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు మోటివేషనల్‌ స్పీచ్‌ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి పాఠశాల హెచ్‌ఎం శంకర్‌ కుమారుడు శేషు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఆ దిశగా పయనించాలన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా వినాలన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకర్‌ మాట్లాడుతూ.. తన కుమారుడైన శేషు భువనేశ్వర్‌లో డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్నాడని సెలవులో వచ్చిన సందర్భంగా విద్యార్థులకు చదువుపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం శేషును ఉపాధ్యాయులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

దేశాభివృద్ధిలో వర్సిటీల పాత్ర కీలకం

- ఏబీఆర్‌ఎస్‌ఎం జాతీయ ఉపాధ్యక్షురాలు కల్పన ప్రవీణ్‌ పాండె



కల్పనను సన్మానిస్తున్న ప్రొఫెసర్‌, అధ్యాపకులు

తెయూ(డిచ్‌పల్లి): భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా ఎదగాలంటే విశ్వవిద్యాలయాలు కీలక పాత్ర పోషించాల్సిన ఆవశ్యకత ఉందని అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్‌ మహాసంఘ్‌ (ఏబీఆర్‌ఎస్‌ఎం) జాతీయ ఉపాధ్యక్షురాలు కల్పన ప్రవీణ్‌ పాండె పేర్కొన్నారు. శుక్రవారం ఏఆర్‌బీఎంఎస్‌ ఆధ్వర్యంలో తెయూ కామర్స్‌ అండ్‌ మేనేజ్‌మెంట్‌ కాలేజ్‌ సెమినార్‌ హాల్‌లో 'వికసిత్‌ భారత్‌– విద్యా రంగం పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అధ్యాపకులు భారతదేశ సంబంధిత పరిశోధనలు, ప్రయోగాలు చేసి 2047వ సంవత్సరం వరకు భారతదేశం ఒక అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన ఏబీఆర్‌ఎస్‌ఎం ఆలిండియా జాయింట్‌ ఆర్గనైజేషన్‌ సెక్రటరీ గుంత లక్ష్మణ్‌జీ మాట్లాడుతూ.. దేశీయ టెక్నాలజీ అభివృద్ధి చేసి, భారతదేశ ఆత్మ నిర్భరతకు పాటుపడాలని అధ్యాపకులకు, పరిశోధకులకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు. సదస్సు సమన్వయకర్తలుగా అధ్యాపకులు వాసం చంద్రశేఖర్‌, ఎం.సత్యనారాయణ, శిరీష బోయపాటి వ్యవహరించారు. అనంతరం అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇంగ్లిష్‌ అండ్‌ ఫారిన్‌ లాంగ్వేజెస్‌ యూనివర్సిటీ అసోసియేట్‌ ప్రొఫెసర్‌ రాజారాం, వర్సిటీ ప్రిన్సిపాల్‌ సీహెచ్‌ ఆరతి, ఏబీవీఆర్‌ఎస్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదయ్య, అధ్యాపకులు ఆంజనేయులు, రాంబాబు, సంపత్‌ కుమార్‌, రవీందర్‌రెడ్డి, నాగరాజు, ప్రసన్నశీల, వీరభద్రం, అకడమిక్‌ కన్సల్టెంట్లు, ఏబీవీపీ పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు రెంజర్ల నరేశ్‌, విద్యార్థులు, పరిశోధకులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం



చెక్కు అందజేస్తున్న ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌ కుమార్‌, ఎల్‌డీఎం శ్రీనివాస్‌, టీజీబీ ఆర్‌ఎం పి నవీన్‌కుమార్‌

డిచ్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని ఆర్‌బీఐ ఏజీఎం అనిల్‌కుమార్‌ సూచించారు. ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల సందర్భంగా శుక్రవారం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌(టీజీబీ) శాఖ ఆధ్వర్యంలో 'పొదుపు ఖాతా ముఖ్య ఉద్దేశం, సైబర్‌ నేరాలు, జాగ్రత్తలు, కేంద్ర ప్రభుత్వ జనసురక్ష పథకాలైన పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాలపై ఖాతాదారులు, ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ముగ్గురు లబ్ధిదారులకు రూ. 2లక్షల చొప్పున మంజూరైన పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎల్‌డీఎం శ్రీనివాస్‌, టీజీబీ రీజినల్‌ మేనేజర్‌ పురం నవీన్‌కుమార్‌, ఎఫ్‌ఎల్‌సీ కౌన్సిలర్‌ మురళిమోహన్‌, టీజీబీ నడిపల్లి బ్రాంచ్‌ మేనేజర్‌ పీవీపద్మ పాల్గొన్నారు.

జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌లో బంగారు పతకం



డిచ్‌పల్లి: బీహార్‌ రాష్ట్రం పాట్నాలో నిర్వహించిన 41వ జాతీయ జూనియర్‌ సాఫ్ట్‌బాల్‌ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు విజయం సాధించింది. ఈ విజయంలో మండలంలోని సుద్దపల్లి గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడాకారులు గోక సాత్విక, గోక శ్రావికలు కీలకపాత్ర పోషించి బంగారు పతకాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్‌ గోదావరి తెలిపారు. శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థినులను అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ దీప్తి వాణి, జూనియర్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ వనిత, ఫిజికల్‌ డైరెక్టర్‌ నల్లూరి లత, పీఈటీ జె.మౌనిక, సాఫ్ట్‌బాల్‌ అకాడమీ కోచ్‌ వేముల మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు..



శివను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

కామారెడ్డి అర్బన్‌: పట్టణంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల జూనియర్‌ కళాశాలలో ఔట్‌సోర్సింగ్‌ అధ్యాపకుడిగా పనిచేస్తున్న జరుపుల శివ ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించారు. ఈ సందర్భంగా కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శివను ప్రిన్సిపాల్‌ ఇంతియాజ్‌ అలీ, అధ్యాపకులు అభినందించారు. జాతీయ స్థాయిలో ఏకలవ్య మోడల్‌ స్కూల్‌లో ఫిజిక్స్‌ టీచర్‌గా, తెలంగాణ గురుకుల జూనియర్‌ అధ్యాపకుడిగా, పీజీటీ, టీజీటీ ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు.

విజయ్‌కు అభినందనల వెల్లువ



విజయ్‌

మద్నూర్‌(జుక్కల్‌): మండలంలోని దన్నూర్‌ గ్రామానికి చెందిన విజయ్‌ ఒకేసారి మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. గతేడాది ఆగస్టులో నిర్వహించిన టీజీటీ, పీజీటీ, జూనియర్‌ లెక్చరర్‌ పరీక్షలు రాసిన విజయ్‌ మూడింట్లో విజయం సాధించి అందరినీ ఆశ్చర్యపర్చారు. చిన్ననాటి నుంచి చదువుపైనే మక్కువ పెంచుకునే వాడినని అందువల్లే ఈ విజయం సాధించానని ఆయన పేర్కొన్నారు. తాను జూనియర్‌ లెకర్చర్‌గా ఉద్యోగం చేస్తానని అన్నారు. విజయ్‌ ఒకేసారి మూడు ఉద్యోగాలు సాధించడంపై మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

రాహుల్‌గాంధీని కలిసిన ఎన్‌ఆర్‌ఐలు



నిజామాబాద్‌ సిటీ: నిజామాబాద్‌ ఎంపీగా పోటీ చేసేందుకు తనకు అవకాశం కల్పించాలని కోరుతూ జిల్లా కేంద్రంలోని కోటగల్లీకి చెందిన మేడిచెట్టి నరేశ్‌ ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీని కలిసి కోరారు. లండన్‌లో ఇండియన్‌ స్టూడెంట్స్‌ తెలుగు ఆర్గనైజేషన్‌ అధ్యక్షుడిగా ఉన్న నరేశ్‌ గురువారం లండన్‌ కేంబ్రిడ్జికి వచ్చిన రాహుల్‌ గాంధీను కలిశారు. తాను ఎన్‌ఎస్‌యూఐ నుంచి వచ్చానని, ఎంపీ పరిధిలో మున్నూరు కాపు ఓట్లు ఎక్కువగా ఉన్నందున తనకు సీటు కేటాయించాలని కోరారు. తెలంగాణ యువతకు నామినేటెడ్‌ పదవుల్లో 50 శాతం సమాన అవకాశం ఇస్తున్నామని రాహుల్‌ గాంధీ చెప్పారని నరేశ్‌ తెలిపారు.

రూరల్‌ ఎన్‌ఆర్‌ఐ నేతలు..

ఇందల్వాయి: యూకే పర్యటనలో ఉన్న రాహుల్‌ గాంధీని లండన్‌లో రూరల్‌ ఎన్‌ఆర్‌ఐ సెల్‌ నాయకులు శుక్రవారం కలిశారు. ప్రాణహిత చేవెళ్ల పథకం ప్రాముఖ్యతను వివరిస్తూ పథకాన్ని పాత పద్ధతిలో పూర్తి చేయాలని విన్నవించారు. ఎన్‌ఆర్‌ఐ నాయకులు కళ్యాణ్‌ రెడ్డి తదితరులు ఉన్నారు.

తెలంగాణ నుంచి పోటీ చేయాలని వినతి



ఖలీల్‌వాడి: ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీ యువనేత రాహుల్‌గాంధీని తెలంగాణ నుంచి పోటీ చేయాలని శుక్రవారం ఇండియన్‌ ఓవర్సీస్‌ కాంగ్రెస్‌ నాయకులు కోరారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం లండన్‌ వెళ్లిన రాహుల్‌గాంధీని ఇండియన్‌ ఓవర్సీస్‌ యూకే శాఖ ఉపాధ్యక్షుడు, జిల్లా వాసి రంగుల సుధాకర్‌గౌడ్‌ ఆయనను కలిసి వచ్చే పార్లమెంట్‌ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని విన్నవించారు. ఆయన వెంట యూకే ఓవర్సీస్‌ తెలంగాణ నాయకుడు గంప వేణు గోపాల్‌ తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్‌

డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు

- ఎనిమిది మందికి జరిమానా

ఖలీల్‌వాడి: డ్రంకన్‌ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు, ఎనిమిది మందికి జడ్జి సయ్యద్‌ఖదీర్‌ జరిమానా విధించినట్లు ఏసీపీ నారాయణ, ట్రాఫిక్‌ సీఐ వెంకట నారాయణ శుక్రవారం తెలిపారు. పులాంగ్‌కు చెందిన యాదగిరితో పాటు మరో ఎనిమిది మంది డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుబడగా యాదిగిరికి జడ్జి రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు పేర్కొన్నారు. మిగతా ఎనిమిది మందికి రూ. 7800 జరిమానా విధించినట్లు వెల్లడించారు.

కామారెడ్డి జిల్లాలో ఇద్దరికి..

కామారెడ్డి క్రైం: మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఇద్దరికి ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి ప్రతాప్‌ రెండు రోజుల జైలు శిక్షను విధించినట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. రెండు రోజుల క్రితం వాహనాల తనిఖీల్లో ఏసుబాబు, సురేశ్‌లను పోలీసులు డ్రంకన్‌ డ్రైవ్‌లో పట్టుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ప్రతాప్‌ వీరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మతిస్థిమితం కోల్పోయి ఒకరి ఆత్మహత్య



నస్రుల్లాబాద్‌: మతి స్థిమితం కోల్పోయి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నస్రుల్లాబాద్‌ గ్రామానికి చెందిన మోహన్‌(40) గురువారం బంధువుల ఇంటికి వివాహ వేడుకల నిమిత్తం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. శుక్రవారం ఉదయం ఇంటికి ఒంటరిగానే వచ్చి భార్యకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఫోన్‌ చేసి చెప్పాడు. దీంతో కుటుంబీకులు వచ్చే సరికి ఆత్మహత్య చేసుకున్నాడు. గతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తలకు గాయం కావడంతో మోహన్‌ మతిస్థిమితం కోల్పోయాడని కుటుంబీకులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పేకాట స్థావరంపై దాడి

డొంకేశ్వర్‌: మండలంలోని దత్తాపూర్‌ శివారులో పేకాట స్థావరంపై పోలీసులు శుక్రవారం సాయంత్రం దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకుని వారి నుంచి రూ.12,170 నగదు, ద్విచక్ర వాహనాలను సీజ్‌ చేసినట్లు ఎస్సై రాహుల్‌ తెలిపారు. పట్టుబడ్డ వారిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్‌ సీఐ అంజయ్య, పోలీసు సిబ్బంది ఉన్నారు.

సదాశివనగర్‌లో సైబర్‌ మోసం..

- రూ. లక్షా 80వేలు నష్టపోయిన యువకుడు

సదాశివనగర్‌: మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు సైబర్‌ మోసానికి గురై రూ. లక్షా80వేల నగదు నష్టపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన కమ్మరి కృష్ణ అనే యువకుడికి సైబర్‌ నేరగాళ్లు తాము బజాజ్‌ ఫైనాన్‌లో పనిచేస్తున్నామని 50 పైసల మిత్తికి రూ. 5లక్షల50వేల రుణం ఇప్పిస్తామని నమ్మించారు. దీనికి ప్రాసెసింగ్‌ ఫీజులకు కొంత నగదు చెల్లించాల్సి ఉంటుందంటూ నమ్మబలికారు. ఇది నమ్మిన కృష్ణ వారికి విడతల వారీగా రూ. లక్షా80 వేలు పంపించాడు. రుణం మంజూరు చేయాలంటూ కృష్ణ వారిని కోరగా మరో రూ. 20 వేలు చెల్లిస్తే మంజూరవుతుందని చెప్పారు. దీంతో వీరిపై అనుమానం వచ్చిన బాధితుడు కామారెడ్డిలోని బజాజ్‌ ఫైనాన్స్‌ యాజమాన్యాన్ని సంప్రదించాడు. వారు సమాచారాన్ని పరిశీలించి ఇదంతా మోసమని చెప్పడంతో అవాక్కయ్యాడు. వెంటనే బాధితుడు కృష్ణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పుణ్య స్నానాలకు వచ్చి ఒకరు గల్లంతు

- ఇద్దరు పిల్లలను కాపాడిన బంధువులు



విలపిస్తున్న బంధువులు

రెంజల్‌: పుణ్య స్నానాలకు వచ్చిన ఓ మహిళ గోదావరి నదిలో గల్లంతయ్యింది. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్‌ మండలం పాండు ఫారం గ్రామానికి చెందిన బాలమణి, కుటుంబీకులు, బంధువులతో కలిసి శుక్రవారం మండలంలోని కందకుర్తి గోదావరి నదికి మొక్కులు చెల్లించేందుకు వచ్చారు. బంధువులు నదిలో స్నానాలు చేసి బయటకు రాగా బాలమణి తన ముగ్గురు పిల్లలతో స్నానాలకు వెళ్లింది. అదే సమయంలో ఎగువన ఉన్న మహారాష్ట్రలోని బాబ్లీ గేట్లు తెరవడంతో వరద ప్రవాహం ఎక్కువైంది. దీంతో బాలమణితో పాటు పిల్లలు నీట మునగడంతో గుర్తించిన బంధువులు కాపాడే ప్రయత్నం చేశారు. నీటి ప్రవాహానికి బాలమణి గల్లంతవగా పిల్లలను టవల్‌ సాయంతో బంధువులు కాపాడారు. విషయం తెలుసుకున్న రెంజల్‌ పోలీసులు బోధన్‌ నుంచి అగ్నిమాపక శకటాన్ని రప్పించారు. అప్పటికే వరద పెరగడంతో వెనుతిరిగారు. స్థానిక జాలర్లకు సమాచారం అందించారు. నీటి ప్రవాహం తగ్గిన తర్వాత గాలిస్తామని పేర్కొన్నారు. కళ్ల ఎదుటే తల్లి నీటిలో గల్లంతవడంతో ముగ్గురు పిల్లలు షాక్‌కు గురయ్యారు. బాలమణి గల్లంతుతో కుటుంబీకులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

దుబాయిలో డొంకేశ్వర్‌ వాసి మృతి



సుధా విఠల్‌ (ఫైల్‌)

డొంకేశ్వర్‌: మండల కేంద్రానికి చెందిన సుధా విఠల్‌(55) దుబాయిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు, స్నేహితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విఠల్‌ పాతికేళ్లుగా దుబాయిలో ఉంటూ పని చేస్తున్నాడు. ప్రస్తుతం వేర్‌ ఆడామ్స్‌ కంపెనీలో సేఫ్టీ ఫోర్‌మెన్‌గా పని చేస్తున్నాడు. ఫిబ్రవరి 18న రోడ్డుపై పని చేస్తున్న విఠల్‌ను వాహనం ఢీకొన్నది. తలకు తీవ్ర గాయం కావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కోమాలోకి వెళ్లిన విఠల్‌ చికిత్స పొందుతూ 25న బ్రెయిన్‌డెడ్‌తో మృతిచెందినట్లు అక్కడి వైద్యులు ధ్రువీకరించారు. మృతి విషయాన్ని మూడు రోజుల క్రితం విఠల్‌ స్నేహితుల ద్వారా తెలిసింది. మృతదేహాన్ని స్వదేశానికి పంపించడానికి అక్కడి స్నేహితులు ఏర్పాట్లు పూర్తి చేయగా, శనివారం డొంకేశ్వర్‌ గ్రామానికి రానుంది. మృతుడికి భార్య గంగామణి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అయితే, బ్రెయిన్‌ డెడ్‌తో మరణించిన విఠల్‌ అవయవాలను అతని కుటుంబ సభ్యుల అనుమతితో అక్కడి ప్రభుత్వం తీసుకుంది.

ఆకతాయిలపై కేసు నమోదు

భిక్కనూరు: పాఠశాలకు వెళ్తున్న విద్యార్థినులను వేధించిన ముగ్గురు ఆకతాయిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయికుమార్‌ శుక్రవారం తెలిపారు. మండలంలోని కంచర్ల గ్రామానికి చెందిన కొందరు విద్యార్థినులు పెద్దమల్లారెడ్డి పాఠశాలకు వెళ్తుండగా పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన ముగ్గురు ఆకతాయిలు వేధింపులకు గురి చేశారు. ఈ విషయమై విద్యార్థినుల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆకతాయిలను పట్టుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలను ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నిందితుల పట్టివేత

బాన్సువాడ రూరల్‌: మండల శివారులోని బీర్కూర్‌ చౌరస్తాలో సీసీ కెమెరాలను దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ కృష్ణ శుక్రవారం తెలిపారు. గురువారం పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న సమయంలో బీర్కూర్‌ చౌరస్తాలో పిట్లం మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన గొంకురి దత్తు, దోమల సిద్దులు సీసీ కెమెరాలను దొంగిలిస్తుండగా కానిస్టేబుల్‌ గైనిశంకర్‌ పట్టుకొన్నట్లు తెలిపారు. విచారణలో నిందితులు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితుల నుంచి రూ. 35 వేలు విలువ చేసే మూడు సీసీ కెమెరాలతో పాటు ఒక ఎన్‌వీఆర్‌ స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అనంతరం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

వేర్వేరు చోట్ల పలువురి అదృశ్యం



నాగరాజు (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్‌ కాలనీలో నివాసం ఉండే పప్పుల నాగరాజు అదృశ్యమైనట్లు ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌ రెడ్డి శుక్రవారం తెలిపారు. గత నెల 29న కుటుంబ సభ్యులతో గొడవ పడి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. నాగరాజు భార్య అంజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. సదరు వ్యక్తికి వైకల్యం కారణంగా ఎడమ వైపు ప్లాస్టిక్‌ కాలు ఉంటుందని, ఎవరైనా అతడిని గుర్తిస్తే పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

పోతంగల్‌లో వృద్ధురాలు..

రుద్రూర్‌: కోటగిరి పీఎస్‌ పరిధిలోని పొతంగల్‌ మండల కేంద్రానికి చెందిన మేతరి పోశవ్వ అనే వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సందీప్‌ శుక్రవారం తెలిపారు. గత నెల 25 నుంచి ఇంటి వెళ్లిన పోశవ్వ తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రాజారాంనగర్‌లో మరొకరు..



స్వామి (ఫైల్‌)

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజానగర్‌ కాలనీలో నివాసం ఉండే కనకంటి స్వామి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కాలనీకి చెందిన స్వామి తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. మూడేళ్ల క్రితం భార్యాభర్తల మధ్య గొడవలు జరగడంతో తల్లిగారింటికి వెళ్లిపోయింది. ఈ నెల 16న సిరికొండలో పనికి వెళ్తున్నట్లు తల్లి గంగవ్వకు చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

మోపాల్‌లో ఒకరు..



కాషా గౌడ్‌ (ఫైల్‌)

మోపాల్‌: మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన కాషా గౌడ్‌ అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్‌ శుక్రవారం తెలిపారు. కాషా గౌడ్‌ స్థానిక కల్లు దుకాణంలో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఫిబ్రవరి 16న ఇంటి నుంచి వెళ్లిన ఆయన తిరిగి రాలేదు. కుటుంబీకులు పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. కాషా గౌడ్‌ కుమారుడు కళ్యాణ్‌ గౌడ్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.